

మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 8: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 10వ తేదీ నుంచి 13వరకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న గురువారం దుర్గాష్టమి సందర్భంగా, 11న శుక్రవారం మహార్నవమి, 12న శని వారం దసరా పర్వదినం పురస్కరించుకొని, 13న ఆదివారం దసరా మరుసటి రోజు సందర్భంగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈ నెల 14 నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

నాణ్యమైన విద్య కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

- విద్యుత్‌శాఖ ద్వారా మెరుగైన సేవలందించండి
- విద్యుత్‌శాఖలో సమస్యలుంటే 1912కు ఫోన్ చేయండి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కలెక్టరేట్‌లో వివిధ శాఖలపై సమీక్ష



ఖమ్మం కలెక్టరేట్‌లో వివిధ శాఖల సమీక్షలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో నాణ్యమైన విద్యాబోధన కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుచేస్తున్నామని, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలతో పాటు ఎన్పీడీసీఎ ల్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా భట్టి విక్ర మార్క అధికారులనుద్దేశించి ప్రసంగించారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అంత ర్జాతీయ ప్రమాణాలతో పేద, బడుగు బలహీనవర్గాల పిల్లలకు విద్యనందించేందుకు చర్యలు చేపడుతున్నామ న్నారు. జిల్లా అధికారులు ప్రతి 15రోజులకోసారి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో బసచేయాలని ఆదేశిం చారు. ఆకస్మికంగా ఆశ్రమపాఠశాలలు, హాస్టల్స్‌ను తని ఖీ చేసి, నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్పులు, కాస్మెటిక్ చార్జీలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలి పారు. ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కావాల్సిన భూసేక రణ జరపాలని, తొలి విడతగా 20 పాఠశాలలు ప్రతిపాదించామన్నారు. ఈ పాఠశాల భవ నాలకు రూ.5వేల కోట్లు ఖర్చుచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాల సకాలంలో అందించాలని సూచించారు. హైవేల నిర్మాణ క్రమంలో స్థానిక రోడ్లుపూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేసేలా చూడాలని అధికారు లను ఆదేశించారు. ఇటీవల వరదలతో పైపులైన్లు దెబ్బతిన్నాయని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు 1912కు ఫోన్‌చేసిన వెంటనే సిబ్బంది స్పందించి సేవలందించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించ డమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, 2029-30నాటికి 20వేల మెగావాట్ల హరిత విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. పొలంబాట ద్వారా విరిగిపోయిన స్తంభాలు, దెబ్బ తిన్న లైన్లను గుర్తించి పరిష్కరించాలన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి..

విద్యుత్‌శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యానికి అనుగుణంగా వినియోగదారులకు మెరుగైన సేవలందించేలా విద్యుత్ సిబ్బంది పనిచేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఖమ్మం, వరంగల్ విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగం ఎంత ఉన్నా అందించేందుకు ముందస్తు ప్రణాళికలు తయారుచేయాలని కోరారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో, వరదల సమయంలో విద్యుత్‌శాఖ సిబ్బంది (మిగతా 8వ పేజీలో)



ఖమ్మం కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



కొత్తగూడెం కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి...

పూల సంబురం

- ఇరు జిల్లాల కలెక్టరేట్‌లలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- కొత్తగూడెంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ దంపతులు
- ఖమ్మంలో బతుకమ్మ చేబూని ఉత్సాహపరిచిన కలెక్టర్

కొత్తగూడెం సాంస్కృతికం /ఖమ్మం కలెక్ట రేట్, అక్టోబరు 8: బతుకమ్మ పర్వంలో ఏడో రోజు సంస్కృతీ సంప్రదాయాలు గుబాళించాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహి ళలు సందడి చేశారు. ఖమ్మం, కొత్తగూడెం కలె క్టరేట్‌ల ఆవరణలో మంగళవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు ఉత్సా హంగా పాల్గొన్నారు. కొత్తగూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రఘు రాంరెడ్డి పాల్గొని మహిళలను ఉత్సాహపరిచారు. పూలను దేవతలుగా పూజించే తెలంగాణ ప్రజల సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. కొత్తగూడెంలోని కలెక్టరేట్ ఆవరణలో మంగళ వారం సాయంత్రం జరిగిన బతుకమ్మ సంబ రాల్లో మంత్రి పొంగులేటితో పాటు ఎంపీ ఆర్.ర ఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు సాగే ఈ పండుగ ఆరోగ్యం, దైవత్వాన్ని కలుగజేస్తుంద న్నారు. కాగా, వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిబ్బంది తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను కార్యాలయ ప్రాంగణంలో ఉంచి ఆటపాటలతో సందడి చేశారు.

బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో లయబద్ధంగా పాటలు పాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలను ప్రతిబింబింప చేసారు. విభిన్నరూపాలలోని అందమైన బతుకమ్మలు చూపరులను ఆక ట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ జితేష్ వీ పాటిల్ సతీమణి శ్రద్ధామ హాజన్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు..



కొత్తగూడెంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ సతీమణి శ్రద్ధామహాజన్

ఖమ్మం కలెక్టరేట్‌లో....

ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో మంగళ వారం సాయంత్రం వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... అంటూ ఆట పాటలతో సందడి చేశారు. మహిళలు, ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ కూడా కలిసి ఆడి వారిని ఉత్తేజపరి చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతు కమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకా లుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధ విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త టీచర్లు వస్తున్నారు..

- డీఎస్సీ పరీక్షల తుది ఫలితాల విడుదల
- ఖమ్మంలో 520 మంది.. భద్రాద్రి జిల్లాలో 413మంది ఎంపిక
- విజేతల కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు
- నేడు హైదరాబాదులో సీఎం నుంచి నియామక పత్రాల స్వీకరణ
- ఖమ్మం నుంచి 22, కొత్తగూడెం నుంచి 10 బస్సుల ఏర్పాటు

ఖమ్మం ఖానాపురం హవేలీ/కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపాధ్యాయుల నియామకం కోసం చేపట్టిన తొలి డీఎస్సీ ప్రక్రియ ఆఖరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే డీఎస్సీ ఫలితాల విడుదలతో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి కావడంతో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులంతా బుధవారం హైదరాబాద్‌లో సీఎం నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు.

ఖమ్మం జిల్లాలో 520 మంది ఎంపిక

డీఎస్సీ-2024 ద్వారా ఖమ్మం జిల్లాలో 520మంది కొత్త ఉపాధ్యాయులు కొలువు దీరనున్నారు. వీరంతా బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. వీరి కోసం ఖమ్మం నూతన కలెక్టరేట్ నుంచి 22 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. విభాగాల వారీగా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయు ల్లో హిందీ లాంగ్వేజ్ పండిట్‌లుగా 10మంది, తెలుగు పండిట్లుగా ఏడుగురు, పీఈటీలుగా 10మంది, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌కు 41మంది, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌కు తొమ్మిది మంది, హిందీ స్కూల్ అసిస్టెంట్స్‌గా తొమ్మిది మంది, స్కూల్‌అసిస్టెంట్ మ్యాథమెటిక్స్‌కు 35 మంది, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒకరు, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో 58మంది, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 15మంది, ఎస్‌జీటీ తెలుగు మీడియంలో 315, ఎస్‌జీటీ ఉర్దూ మీడియంలో ఆరుగురు ఎంపికయ్యారు. కాగా, డీఎస్సీ తుది ఫలితాల విడుదలతో విజేతల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. స్వీట్లు పంచుకొని తమ ఆనందాన్ని చాటుకున్నారు.

భద్రాద్రి జిల్లాలో 413మంది..

భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో డీఎస్సీ-24 ద్వారా మొత్తం 447పోస్టుల పరీక్ష నిర్వహించగా 413పోస్టులకే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి కావడంతో (మిగతా 8వ పేజీలో)

బొగ్గు వ్యాగన్‌లో మృతదేహం

- కేటీపీఎస్ కోల్ ప్లాంట్‌లో గుర్తింపు
- మృతుడు సుజాత నగర్ మండలం సీతంపేట వాసి 8

కుల వృత్తులకు చేయూత

- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి
- పాలేరు జలాశయంలో చేపపిల్లల విడుదల 8

నేటి నుంచి 'సదరం'

- డిసెంబరు 31 వరకు శిబిరాల నిర్వహణ
- మీసేవల్లో స్లాట్ బుకింగ్ ప్రారంభం 8

పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

- నిరంతరాయ విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం
- 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపనలు
- మూసీ ప్రాంత ప్రజలు అభివృద్ధి కోసమే నదీ ప్రక్షాళన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులన్నింటిని గుర్తించామని, త్వరలో భారీ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయబోతున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంకలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్‌శాఖలో ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే, ఎవరైనా డబ్బులు అడిగినా 1912కు ఫోన్ చేసి సమస్య చెప్పుకోవచ్చని అన్నారు. గత పదేళ్లుగా పదోన్నతుల లేక ఇబ్బందులు పడుతున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులకు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పదోన్నతులు ఇచ్చామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని జిల్లాలకు వరంగల్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ సరఫరాద్వారా సేవలందిస్తుందని, ఎన్నో లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నాయని, సీతారామ వంటి ఎత్తిపోతల పథకాలు కూడా ఈపరిధిలో ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సేవలందించాలని తెలిపారు. థర్మల్ పవర్‌తో పాటు సోలార్, జలవిద్యుత్, పవన విద్యుత్‌తో పాటు గ్రీన్ ఎనర్జీ పవర్‌ను కూడా ఉత్పత్తి చేసేందుకు 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మధిర మండలం సిరిపురంతో పాటు రాష్ట్రంలో పలుచోట్ల సోలార్ మోడల్ గ్రామాలను ఎంపికచేసి పూర్తిసోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కరెంట్ ఒక్కనిమిషం కూడా పోకుండా నిరంతరాయంగా అందించడం ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఇటీవల జిల్లాలో ధాన్యం సేకరణలో మిల్లుల్లోజరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రపంచస్థాయి విద్య కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

రాష్ట్రంలో పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యనందించేందుకు ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు ఈనెల 11న పలుచోట్ల శంకుస్థాపన చేయబోతున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేదపిల్లలకు అంతర్జాతీయస్థాయి విద్య అందించడం సహించలేనివాళ్లు కొందరు విమర్శలు చేయడం తగదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌నుద్దేశించి అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి అని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1వతేదీనే ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామని అన్నారు. అనేక నెలలుగా డైట్‌బిల్లులు పెండింగ్‌లో ఉంచితే రూ.114కోట్లు బిల్లులు విడుదలచేశామని అన్నారు.

విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకే మూసీ ఆధునికీకరణ

హైదరాబాదు నగరంలో మురికికూపంగా ఉన్న మూసీ నదిని హైదరాబాదు విశ్వనగరంగా అభివృద్ధిలో భాగంగా ఆధునీకరించబోతున్నామని, ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. మాజీమంత్రి జగదీశ్వరరెడ్డి ఏదైనా మూసీనది అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలుంటే ఇవ్వాలని అంతే తప్పా విమర్శలు చేయవద్దన్నారు. జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్ కూటమి గెలుపొందడం హర్షించదగిన విషయమని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈవిలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మాలోతు రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఆలయ అభివృద్ధి పనులపై
డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష


ఇంజనీరింగ్ అధికారికి సూచనలు చేస్తున్న భట్టి విక్రమార్క

వైరా, అక్టోబరు 8: వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమీక్షించారు. ఖమ్మంజిల్లా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా స్నానాల లక్ష్మీపురానికి వచ్చారు. ఈ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఎస్‌డీఎఫ్ కింద రూ.3.20కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆగస్టు తొమ్మిదిన ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క వాటి నిర్మాణాలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో పరిశీలించి సమీక్షించారు. కాంపౌండ్‌వాల్ రూ.50లక్షలు, కల్యాణవేదిక రూ.20లక్షలు, బాత్‌రూమ్స్ అండ్ టాయిలెట్స్ రూ.50లక్షలు, అభిషేక మండపం రూ.50లక్షలు, ఐదుగదుల సత్రం రూ.50లక్షలు, డార్మెటరీ(బీ+1)నిర్మాణం రూ.కోటితో చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గ్రామప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ నిర్మాణాలను పక్కా ప్రణాళికతో పూర్తిచేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. వైరా నదిపై ఆరేళ్ల కిందట చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందున ఆలయ అభివృద్ధి పనులకుదానివలన అడ్డంకి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమీక్షించారు. అవసరమైతే అసంపూర్తిగా ఉన్న హైలెవల్ వంతెన నిర్మాణాన్ని వదిలేసి మరోచోట కొత్తగా వంతెన నిర్మిస్తే ఎలా ఉంటుందనే దానిపై కూడా పరిశీలించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు నూతి సత్యనారాయణ, దొడ్డా పుల్లయ్య, దొబ్బల సౌజన్య, మల్లు రామకృష్ణ, అడుసుమల్లి గణేష్, ఏదునూరి సీతరాములు, నూతి వెంకటేశ్వరరావు, దాసరి దానియేలు, మడుపల్లి భాస్కర్, కర్నాటి హన్మంతరావు, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం నింపే దిశగా కామ్రేడ్లు...

- సంస్థాగతంగా బలోపేతమయ్యేందుకు సీపీఎం అడుగులు
- అదనంగా గ్రామ శాఖల పెంపునకు ప్రయత్నం
- తెరపైకి డివిజన్ కమిటీల ఏర్పాటు కసరత్తు

భద్రాచలం, అక్టోబరు 8: పార్టీ క్యాడర్‌లో జవసత్వాలు, ఆత్మస్థైర్యం నింపే దిశగా కామ్రేడ్లు దృష్టిసారిస్తున్నారు. పూర్వ వైభవంను పునరుద్ధరించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై కామ్రేడ్లు కసరత్తు మొదలుపెట్టారు. గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమిని క్యాడర్ జీర్ణించుకోలేని పరిస్థితులున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రాచలం అసెంబ్లీ నియోజవకర్గంలో తమ ఓట్లు సైతం ప్రత్యర్థి పార్టీలకు పోల్ కావడంతో ఆ పార్టీ నాయకుల్లో అంతర్మదనం నెలకొంది. ఈ క్రమంలో ప్రస్తుతం సీపీఎంకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లోని 480 గ్రామ శాఖలుండగా గ్రామ శాఖల ఎన్నికలకు తెరతీసారు. సెప్టెంబరు నెలలో పార్టీ గ్రామ శాఖ ఎన్నికలకు తెరతీయగా అక్టోబరు 10తో తొలి అంకం ముగియనుంది.

కాగా నవంబర్లో మండలస్థాయి, డిసెంబర్లో జిల్లా మహాసభల నిర్వహణకు పార్టీ ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. అయితే ప్రస్తుతం ఉన్న 480 గ్రామశాఖలకు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో మరికొన్ని శాఖలను అదనంగా పెంచేందుకు నిర్ణయించినట్లు పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. జనవరిలో ఆ పార్టీ రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మూడేళ్లకోసారి జరిగే మహాసభలను పురస్కరించుకొని గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతంకు చర్యలు చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

డివిజన్ కమిటీలపై కసరత్తు

గతంలో సీపీఎం డివిజన్ కమిటీలు సంస్థాగత ప్రక్రియలో భాగంగా ఉండేవి. అయితే ఆరేళ్ల క్రితం వీటిని ఆ పార్టీ నాయకత్వం రద్దు చేసింది. అయితే తాజాగా మళ్లీ డివిజన్ కమిటీల ఏర్పాటుపై ఆ పార్టీ నాయకత్వం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. డిసెంబర్లో జిల్లాస్థాయి మహాసభల్లో ఈ మేరకు నాయకత్వం చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర కమిటీ, డివిజన్ కమిటీల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయడంతో ఇందుకు మార్గం సుగమం అయినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే గతంలో డివిజన్ కమిటీల పర్యవేక్షణ ఉండటంతో పార్టీ క్యాడర్‌కు నాయకత్వం అందుబాటులో ఉండటం, కార్యక్రమాలు రూపొందించడం, నిర్వహణ ఇతరత్రా కార్యక్రమాలు వేగంగా సాగేవని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆత్మస్థైర్యం నింపే దిశగా...

గతంలో కామ్రేడ్లకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కంచుకోటలా ఉండేది. ముఖ్యంగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం సీపీఎంకు గుండెకాయలాంటిదని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇక్కడ ఎనిమిదిసార్లు సీపీఎం నుంచి పోటీ చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలంలో ఆ పార్టీ ఘోరమైన ఓటములను చవి చూడటం ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేక పోతోంది. అంతే కాదు పార్టీలో కీలక పదవులు అనుభవించిన కొందరు నాయకులు అనంతరం ఇతర పార్టీలకు వలస వెళ్లడం కూడా జరిగింది. ఈ క్రమంలో పార్టీలో జవసత్వాలు ఆత్మస్థైర్యం నింపేందుకు సీపీఎం నాయకత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. శాఖ మహాసభలలో క్యాడర్‌కు ఉత్తేజం నింపుతూ రాబోయే కాలంలో బలోపేతమైన పార్టీగా మరోసారి రూపుదిద్దుకునేందుకు కసతర్తు చేపట్టింది.

12న విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

- తుమ్మల కృషితో 2.5మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణం
- ఆయిల్‌పామ్ గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి

సత్తుపల్లి, అక్టోబరు 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ కార్మాగారం ఆవరణలో రూ.33కోట్ల వ్యయంతో నిర్మించిన 2.5మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి ప్రారంభిస్తారని ఆయిల్‌పామ్ గ్రోయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుమ్మల కృషితో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పూర్తి అయిందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్రంలో అన్ని ఆయిల్‌పామ్ కంపనీల ప్రతినిధులు పాల్గొంటారని, రైతులు పెద్ద సంఖ్యలో పాలొనాలని కోరారు. ఇదేరోజున ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఐఐఓపీఆర్ (పెద్దవేగి) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ గెలలకు మద్దతు ధర పెరిగే విధంగా కృషి చేసిన మంత్రి తుమ్మలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దిగుమతి సుంకం పెంచడంతో టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.14వేల నుంచి రూ.17వేలకు పెరిగిందని అన్నారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు డా.కందిమళ్ల కృష్ణారావు, బండి గుర్నాథరెడ్డి, చల్లగుళ్ల నరసింహారావు, ఆయిల్‌ఫెడ్ అధికారులు బాలకృష్ణ, రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించని ప్రభుత్వాలు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

కొత్తగూడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింసలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని వాటిని పట్టించుకునే విధంగా ఈ ప్రభుత్వాలు పని చేయడం లేదని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం టీచర్స్ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనగణన నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 33శాతం రిజర్వేషన్లు అమలులో ప్రభుత్వాలు తాత్సారంచేస్తున్నాయని ఆమె విమర్శించారు. యువత డ్రగ్స్‌బారిన పడుతున్నారని వాటిని నివారించేవిధంగా పని చేయడం లేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని వీటన్నింటి పై ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈ అంశాలపై చర్చించనున్నారని చర్చించి భవిష్యత్‌కార్యచరణ రూపొందించుకుని ఉద్యమాలు చేపడతామన్నారు.

ఎక్సైజ్‌శాఖలో దసరా వసూళ్లు

- ఒక్కో మద్యం షాపు నుంచి రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 8: దసరా అనగానే గుర్తుకువచ్చేది మామూళ్ల దందా. ఒక స్థాయి వరకు మామూళ్లు అడిగితే... అది ఇచ్చే వారికి తీసుకునే వారికి మధ్య వివాదం లేకుండా ఉంటుంది. కానీ శ్రుతి మించితేనే వీధిన పడుతుంది. ఈ దసరాకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎక్సైజ్‌శాఖ దసరా మామూళ్ల వసూళ్లు శ్రుతి మించుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మద్యం వ్యాపారులు, బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం విక్రయాల్లో నిబంధనలను ఉల్లంఘించడం సహజంగా మారింది. వీరికి కొంతమంది ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది లోపాయికారిగా సహకరిస్తుంటారు. దీంతో ప్రతీ దసరాకు మామూళ్ల వసూలు వ్యవహారం అలవాటుగా మారింది. ప్రతీ సంవత్సరం ఒక్కో మద్యం దుకాణం నుంచి దసరా సందర్భంగా రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసేవారు. అయితే ఈ సంవత్సరం మాత్రం ఎక్సైజ్‌శాఖలోని కొందరు అధికారులు... విభజన చేసి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎక్సైజ్‌శాఖలోని అధికారులు, సిబ్బంది స్థాయిని బట్టి మామూళ్ల వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో మద్యం షాపు నుంచి అధికారికి రెండు కేసుల మద్యం బాటిల్స్(రూ.30వేలు), కానిస్టేబుళ్లకు రూ.5వేలు, డ్రైవర్లకు రూ.3వేలు, స్టేషన్ సిబ్బందికి రూ.5వేలు, పైస్థాయి అధికారి కార్యాలయ సిబ్బందికి రూ.5వేల చొప్పున డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికే కొన్ని మద్యం దుకాణాల వద్దకు వెళ్లి వసూళ్ల ప్రారంభించినట్టు తెలిసింది. అయితే మద్యం వ్యాపారులు మాత్రం ఆ స్థాయిలో మామూళ్ల ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు.

డబ్బులు అడిగితే చర్యలు: డిప్యూటీ కమిషనర్

ఈ విషయమై ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని వివరణ కోరగా దసరా సందర్భంగా మద్యం వ్యాపారులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని అన్నారు. దసరా మామూళ్ల అడిగే విషయం తన దృష్టికి రాలేదని, ఎవరైనా డబ్బులు అడిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేటి నుంచి 'సదరం' క్యాంపులు

- డిసెంబరు 31 వరకు శిబిరాల నిర్వహణ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8: జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా జారీ చేసే వైకల్య నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే గుర్తింపు లభిస్తుంది. దీని ద్వారానే దివ్యాంగులు పలు ప్రయోజనాలు పొందే ఆస్కారం ఉంటుంది. పుట్టుకతో అంగవైకల్యం, నరాల బలహీనత, కంటిచూపు లోపం, వినికిడి సామర్థ్యం కోల్పోవడం, మతిస్థిమితం కోల్పోయిన వారు., యాసిడ్ దాడులకు గురైన వారు శిబిరానికి హాజరైతే వైద్య బృందం పరీక్షలను నిర్వహించి నెల రోజుల్లో గుర్తింపు పత్రాన్ని జారీ చేస్తుంది. రహదారి ప్రమాదాల్లో గాయపడి వికలత్వం పొందిన వారికి కూడా ఇవి వర్తిస్తుంది.

నేటి నుంచి డిసెంబరు 31 వరకు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబరు 9 నుంచి డిసెంబరు31 వరకు నిర్ణయించిన తేదీల ప్రకారం సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయనున్నట్లు జిల్లా జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ తెలిపారు. మీసేవా కేంద్రాల్లో సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు జీరాక్స్, పాస్‌ఫొటోను మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాలి. స్లాట్ బుకింగ్ ప్రకారం దరఖాస్తుదారుడు మీసేవ రశీదుతో పాటు మెడికల్ క్యాంపునకు హాజరవ్వాల్సి ఉంటుంది. వైద్యులు క్యాంపుల్లో పార్ట్- ఏ వివరాలను ఆమోదించి సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేస్తారు. మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ శనివారం నుంచి ప్రారంభమైందని తెలిపారు.

తేదీలు ఇవీ :

అక్టోబరు 9, 15, 22, 29, నవంబరు 5,12, 19,26, డిసెంబరు 3, 10, 17,31 తేదీల్లో సదరం క్యాంపులను ఖమ్మంలోని ప్రధాన ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగించుకోవాలని డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ కోరారు.

నాణ్యమైన విద్య కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్


సమీక్షకు హాజరైన అధికారులు

(7వ పేజీ తరువాయి)

అర్ధరాత్రి సమయంలో సైతం సేవలందించారని, ఇందుక ప్రతి ఒక్కరిని అభినందించారు.

ఆపత్కాలంలో ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుదని, కొందరు నిర్లక్ష్యం వల్ల శాఖ అందరికి అప్రతిష్ట వస్తుందని, ప్రతి ఒక్కరు విధినిర్వాహణలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను పటిష్ఠం చేయబోతున్నామని, ట్రాన్స్‌ఫారాలు లైన్లు, స్తంభాల కొరత లేకుండా ఇవ్వడం జరుగుతుందని, గృహజ్యోతి ద్వారా 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రైతులకు సోలారుపంపుసెట్లతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం సహకరిస్తుందని, మధిర మండలంలోని సిరిపురం గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేశామని భట్టి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మాలోతు రాందాస్‌నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లు వస్తున్నారు..

(7వ పేజీ తరువాయి)

వారే బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు 10ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేసి ఎంపికైన వారందరినీ హైదరాబాద్‌కు తీసుకెళ్లనున్నారు. బుధవారం తెల్లవారుజామున 4.30గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుంచి అభ్యర్థులు హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు. అభ్యర్థులంతా ఉదయం 4గంటలకు ప్రకాశం స్టేడియానికి రావాలని అధికారులు సూచించారు. వీరికి ఐడీ కార్డును అందజేసి, ఉదయం అల్పాహారం, భోజనం సదుపాయం కల్పిస్తున్నారు. అభ్యర్థుల్లో బాలింతలు, వికలాంగులకు ఒక సహాయకుడిని అనుమతించనున్నారు. హైదరాబాద్ ట్రిప్ పర్యవేక్షులుగా డీఈవో వెంకటేశ్వరచారి, ట్రైనింగ్ నోడల్ అధికారి నాగరాజ శేఖర్, సైదులు, సతీష్ లు వ్యవహరించనున్నారు.

దివ్యాంగ, స్పోర్ట్స్ కేటగిరిలో పూర్తికాని వెరిఫికేషన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 447 పోస్టులకు పరీక్షలు నిర్వహించగా బుధవారం 413 మంది కొత్త టీచర్లే సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. మిగిలిన 34 పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తికాకపోవడంతో వారి ఎంపిక ఆలస్యం కానుంది. ముఖ్యంగా దివ్యాంగులు, స్పోర్ట్స్ కేటగిరి పోస్టుల వెరిఫికేషన్ నిర్వహించపోవడంతో ఆయా కేటగిరిల్లోని అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. దివ్యాంగులు, స్పోర్ట్స్ కేటగిరిలో అభ్యర్థుల అర్హత అంశంలో ఇబ్బందుల నేపథ్యంలో నియామక ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ విషయంపై డీఈవో వెంటేశ్వరచారిని వివరణ కోరగా జిల్లాలో దివ్యాంగ, స్పోర్ట్స్ కేటగిరిలో సుమారు 6పోస్టులకు అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, ఉన్నతాధికారుల అనుమతితో వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అర్హత కలిగిన దివ్యాంగ, స్పోర్ట్స్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. మరికొంత మంది జనరల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి కాలేదన్నారు.

కుల వృత్తులకు చేయూతనిస్తాం..

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- పాలేరు జలాశయంలో చేపపిల్లల విడుదల


పాలేరు రిజర్వాయర్‌లోకి చేపపిల్లలను వదులుతున్న పొంగులేటి

కూసుమంచి, అక్టోబరు 8: కుల వృత్తులను నమ్ముకుని బతుకుతున్న కుటుంబాలలో వెలుగులు నింపేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి మండలం పాలేరు జలాశయంలో రూ.10లక్షల విలువైన 6550 చేపపిల్లలను మంత్రి విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. జలాశయం సామర్థ్యం అధికంగా ఉన్న జలాశయాల్లో సామర్థ్యం మేర చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు మొదటివారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మత్స్యకారులు వినియోగిస్తున్న తెప్పలు, వలలు, బుట్టలు కొట్టుకొని పోయాయని అన్నారు. వరదల వలన నష్టం జరిగిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. పేదల ముఖంలో ఆనందం చూడాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. మహిళల రివాల్వింగ్ ఫండ్ విడుదల జరిగేలా చూస్తామన్నారు. జాతీయ రహదారి పక్కన చేపల విక్రయాలకు అవసరమైన ఏర్పాట్లు చేయిస్తానని తెలిపారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతు జలాశయంలో చేపలతో పాటు రొయ్య పిల్లల విడుదలకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో గణేష్, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో వేణుగాపాలరెడ్డి, డీఎల్‌పీవో రాంబాబు, మత్స్యసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబకార్డు ద్వారా సంక్షేమ పథకాలు

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికి కుటుంబ కార్డు ద్వారా ప్రభుత్వసంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జల్లేపల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే తిరుమలాయపాలెం మండలపరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అక్టోబరు నెలాఖరునాటికి రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుచేస్తామన్నారు. పాలేరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తామన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై మంత్రి ఆగ్రహం

మండలంలోని కాకరవాయి, బచ్చోడు, బీరోలు తదితర గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు రావడంలేదని ప్రజలు మంత్రి దృష్టికి తేగా స్పందించిన పొంగులేటి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవల కురిసిన భారీవర్షంతో పైపులైన్లు పగిలాయని, వాటిని మరమ్మతులు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్. మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, యన్నం సుధాకర్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, వనవాసం నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ టికెట్లకు నూతన వెబ్‌సైట్


ఖమ్మం, ఖానాపురంహవేలి అక్టోబర్ 8: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల సీట్ బుకింగ్ కొరకు నూతన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. www.tgsrtcbus.in అనే నూతన వెబ్‌సైట్ ద్వారా సీట్ బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. గతంలో ఉన్న www.tsrtconline.in లో కూడా టికెట్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కండక్టర్ కారుణ్య నియామకాల ఎంపికలు

ఖమ్మం రీజియన్ పరిధిలో కారుణ్య నియామకాల ద్వారా కండక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 66 మంది అభ్యర్థులకు అక్టోబరు 17న ట్రేడ్ విన్నర్ స్కీంలో 43 మందికి, 18న మెడికల్ రిటైర్మెంట్ స్కీంలో 23 మందికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం సరిరాం తెలిపారు. ఖమ్మం నూతన బస్టాండ్‌లో కాల్ లెటర్‌లో తెలిపిన విధంగా ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

బొగ్గు వ్యాగన్‌లో శవం

- కేటీపీఎస్ కోల్‌ప్లాంట్‌లో గుర్తింపు
- మృతుడు సుజాతనగర్ మండలం సీతంపేట వాసి


కార్మికులు గుర్తించిన రమేష్ మృతదేహం

పాల్వంచ, అక్టోబరు 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 6వదశ కోల్‌ప్లాంట్‌లో కార్మికులు మంగళవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. కోల్‌గ్రిడ్‌లో కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ఎంత ప్రయత్నించినా బొగ్గు గ్రిడ్‌లోకి వెళ్లక పోవడంతో ఏదో అడ్డుపడిందని భావించి కార్మికులు పనిని నిలిపివేసి పరిశీలించారు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని మృతదేహం బయల్పడింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కేటీపీఎస్ 6వ దశ అధికారులు ఎస్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మృతుని జేబులో దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా అతను సుజాతనగర్ మండలం సీతంపేట వాసి గుగులోతు రమేష్(34)గా గుర్తించారు. అనంతరం కోల్‌ప్లాంట్ ఏడీఈ నరసింహారావు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు. ఉదయం రుద్రంపూర్‌లోని సీహెచ్‌పీ నుంచి ఆరవ దశకు బొగ్గు లోడు వ్యాగన్లలో వచ్చిందని, అక్కడి నుంచే మృతదేహం వచ్చి ఉండవచ్చని కార్మికులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం మృతుడు గుగులోతు రమేష్ సుజాతనగర్ మండలం సీతంపేటలో స్థిరపడి కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం భార్య దివ్య మృతి చెందింది. వారికి ఒక బాబు(5), ఒక పాప(4) ఉన్నారు. వారిని రమేష్ బొగ్గుట్టలోని తన అక్కగారింట్లో ఉంచి తాను మాత్రం తన తల్లిదండ్రులతో ఉంటున్నాడు. భార్య మృతితో కృంగిపోయిన రమేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే స్నేహితులు ఓ దొంగతనం కేసులో పోలీసులు విచారణకు పిలుస్తారని అతనికి సమాచారం అందించారు. దీంతో రమేష్ ఇంటి నుంచి 15 రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న రమేష్ ఓపెన్‌కాస్ట్‌కు పని నిమిత్తం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అనంతరం తన పిల్లలను చూడటానికి ఇల్లెందు వెళ్లే బొగ్గు వ్యాగన్ ఎక్కే క్రమంలో పాల్వంచ కేటీపీఎస్‌కు వచ్చే వ్యాగన్ ఎక్కి ఉంటాడని భావిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న అతడిని గుర్తించకుండా బొగ్గు దిగుమతి జరిగి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు.

క్రైం సమాచారం

ఎన్‌కౌంటర్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం అక్టోబరు 8:మండల సరిహద్దు చత్తీస్‌ఘడ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్, మావోయిస్టు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతిచెందాడు. మృతుడు కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు లోకేష్‌గా పోలీసులు గుర్తించారు. పామలూరు గుట్టల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, 206, 208 కోబ్రా,131 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. ఘటనా స్థల పరిసరాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల, అక్టోబరు 8: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో తాటి కన్నయ్య (55) అనే గిరిజనుడిని మావోయిస్టులు హత్య చేసిన ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోషణపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. కన్నయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకున్నాడు. అక్కడికి చేరుకున్న మావోయిస్టులు కన్నయ్యను ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం హత్య చేసి సమీప స్కూల్ పక్కన పడేశారు. మృతదేహం వద్ద లేఖను వదిలారు. ఇన్‌ఫార్మర్ అంటూ అందులో ఆరోపించారు. ఈ గటనతో గ్రామంలో భయాందోళనలు మొదలయ్యాయి. మావోయిస్టుల పిరిక పంద చర్యఅని అతను ఇన్‌ఫ్మార్ కాదని పోలీసులు చెబుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ: గ్రామీణ వైద్యుడి దుర్మరణం


కృష్ణారెడ్డి (ఫైల్)

తల్లాడ, అక్టోబరు 8: తల్లాడలోని లూర్దుమాత చర్చి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గ్రామీణ వైద్యుడు మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి(45) చికిత్స పొందుతూ మృతిచెందాడు. తల్లాడ నుంచి సోమవారం రాత్రి బైక్‌పై కృష్ణారెడ్డి నారాయణపురంలోని స్వగృహానికి వెళ్తూ లూర్దుమాత చర్చి సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా తల్లాడకు చెందిన పఠాన్ హుస్సేన్ ప్రయాణిస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణారెడ్డిని కుటుంబసభ్యులు చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ కృష్ణారెడ్డి మృతిచెందాడు. కొన్నేళ్లుగా కృష్ణారెడ్డి తల్లాడ, నారాయణపురం గ్రామాల్లో రోగులకు వైద్యసేవలందిస్తున్నాడు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు తల్లాడ ఏఎస్ఐ జేవీఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

తల్లాడ, అక్టోబరు 8: తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన వృద్ధుడు శీలం నాగిరెడ్డి(72)గుండెపోటుతో మృతిచెందారు. నాగిరెడ్డికి ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు కోటారెడ్డి మాజీ సర్పంచ్, పెద్దకోడలు శివపార్వతి మాజీ వైస్‌ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. నాగిరెడ్డి మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

కారేపల్లి అక్టోబరు 8: మండల పరిధిలోని గోవింద్‌తండాకు చెందిన బానోత్ భజన్(42)అనేవ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం ఖమ్మం ఆసుపత్రిలో మృతిచెందాడు. ఏఎస్ఐ రాజకుమారి కథనం ప్రకారం గోవింద్‌తండాకు చెందిన బానోత్ భజన్ నాలుగు నెలల క్రితం కడుపు నొప్పి రావడంతో అపరేషన్ చేశారు. అయితే ఈనెల 2న మరోసారి కడుపు నొప్పి రావడంతో ఇంట్లో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రి కి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

కామేపల్లి, అక్టోబరు 8: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రగాయల పాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాతానిగూడేనికి చెందిన తేనె నాగయ్య (60), గుగులోత్ రవి ఈనెల 6న పండితాపురం గ్రామంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో నాగయ్యకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కామేపల్లి, అక్టోబరు 8: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాస్తిపల్లి గ్రామానికి చెందిన దేవండ్ల సీతయ్య(50) కుటుంబ సమస్యలతో సతమతమై మనస్థాపంతో సోమవారం కలుపుమందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడు ఉదయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు.

చెన్నారంలో రోడ్డుపై పసికందు మృతదేహం..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి, అక్టోబరు 8: నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో రేషన్ డీలర్ ఇంటి సమీపంలో సుమారు ఆరునెలల వయసున్న మగ శిశువు మృతదేహాన్ని మంగళవారం కనుగొన్నారు. మృతదేహాన్ని అక్కడక్కడా జంతువులు తిన్నాయి. సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అన్ని కోణాల్లో విచారిస్తామని ఎస్ఐ సంతోష్ చెప్పారు.

మట్కా నిర్వాహకులపై కేసు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 8: కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కా నిర్వాహకులను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు దినేష్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌లపై గతంలోనే పలు కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

జాతీయస్థాయి టీటీ పోటీల్లో ఖమ్మం క్రీడాకారుడి ప్రతిభ



ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 8: జమ్మూ కాశ్మీర్‌లోని లడఖ్‌లో ఈనెల 4 నుంచి 8 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో ఖమ్మం నగరానికి చెందిన పిట్టల మోహిత్ కృష్ణ ప్రతిభ చాటాడు. నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే మోహిత్‌క్రిష్ణ టాప్ టెన్‌లో నిలిచిన రాష్ట్ర క్రీడాకారుడిగా ఘనత సాధించాడు. అంతే కాకుండా ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీలలో రాష్ట్ర జట్టుకు ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మొదటి క్రీడాకారుడిగా సైతం నిలవడం విశేషం. జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారుడిని డీవైఎస్ వో సునీల్ రెడ్డి, కోచ్ సాంబమూర్తి, జిల్లా టేబుల్‌టెన్నిస్ సంఘం బాధ్యులు బాలసాని విజయ్, సంపెట ఉపేం దర్, రామచందర్, డాక్టర్ జంగాల సునిల్‌కుమార్ తదిత రులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో సైతం రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కొలువులు సాధించిన జంటలు

- భార్యలు ఎస్‌జీటీలుగా.. భర్తలు స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపిక
- బోనకల్ మండలం రావినూతల, గార్లపాడులో నలుగురు టీచర్లు



కోటేశ్వరావు, కృష్ణవేణి


రవి కుమార్, శ్రావణి

బోనకల్, అక్టోబరు 8: దసరా కన్నా ముందుగానే ఆ రెండు కుటుంబాల్లో కొలువుల పండుగ వచ్చింది. పేదింటి నేపధ్యమైనా చదువుల్లో పట్టుదల, కృషి వారిని లక్ష్యానికి చేరువ చేసింది. వివాహాలు జరిగాక ఇంకా ఏం సాధిస్తామని కొందరి ఆలోచనలు ఉంటే వీరు మాత్రం ఒకవైపు భర్త, పిల్లలు కుటుంబ బాధ్యతలు మోస్తూనే, చదువులోనూ అంతే బాధ్యతను నిర్వర్తించి అందరి మన్ననలను అందుకుంటున్నారు ఆ రెండు కుటుంబాల దంపతులు. డీఎస్సీ ఫైనల్ జాబితాను అధికార వెబ్‌సైట్‌లో పెట్టడంతో పాటు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకునేందుకు సిద్దమయ్యారు. బోనకల్ మండలం రావినూతల గ్రామంలోని చటారి రవి కుమార్ ఎంఏ, ఎంఈడీ విద్యను పూర్తి చేశారు. డీఎస్సీలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గానూ, ఆయన భార్య తాళ్లూరి శ్రావణి ఎస్‌జీటీగా ఉద్యోగాలు సాధించారు. గార్లపాడులో కూడ గూడకుంటల కోటేశ్వరావు స్కూల్ అసిస్టెంట్ గానూ, భార్య నిమ్మటూరి కృష్ణవేణికి ఎస్‌జీటీ ఉద్యోగాలను సాదించారు. ఎస్‌జీటీలుగా ఎంపికైన ఇద్దరు సతీమణులు ఒకే ప్రయత్నంలో ఉద్యోగాలు సాదించడం విశేషం.

ఉపాధ్యాయులుగా అక్కా, తమ్ముడు


జ్యోతి, శ్రీను

ఏన్కూరు: ఏన్కూరు మండలం కాలనీ నాచారం గ్రామానికి చెందిన ఆదివాసీలు ఒకే ఇంటి లో ఇద్దరు అక్క, తమ్ముడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక య్యారు. బొర్ర ఆరంకోటి, మంగతాయి దంపతులకు కుమారుడు కుమార్తె. బొర్రా శ్రీను, జ్యోతి అక్క, తమ్ముడు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో అక్క స్కూల్ అసిస్టెంట్ తెలుగు, తమ్ముడు స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో ఎంపికయ్యారరు. వీరిని ఆదివాసీ ఉద్యోగు సంక్షేమసంఘం, సాంస్కృతిక సంఘం, ఏన్కూరు కొమరంభీం ఫౌండేషన్ సంఘం నాయకులు అభినందించారు.

మంచుకొండ పీహెచ్‌సీలో వైద్యాధికారుల విచారణ

రఘునాథపాలెం, అక్టోబరు 8: ఆసుపత్రిలో పనిచేయాల్సిన మమ్మల్నీ మమ్మల్ని డేటా ఎంట్రీ అపరేటర్లుగా మార్చి వైద్యాధికారి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆసుపత్రి వైద్య సిబ్బంది ఇటీవల జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదుల ఆధ్వర్యంలో మంగళవారం మంచుకొండ పీహెచ్‌సీలో విచారణ నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కనీస వైద్య పరీక్షలు చేయకుండానే ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేపిస్తున్నారని మంచుకొండ పీహె చ్‌సీ పరిదిలోని వైద్య సిబ్బంది జిల్లా వైద్యశాఖ అధికారుల బృందానికి వాంగ్మూలం ఇచ్చి రాత పూర్వకంగా వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదులు' చేశారు. కొద్ది రోజులుగా మంచుకొండ వైద్య సిబ్బందికి, వైద్యాధికారి రమేశ్‌కు మధ్య వివాదాలు రావటంతో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షణ లో మంగళవారం విచారణ జరిగింది.

కోతకు ముందే పక్వానికి వచ్చిన వరి

- పరిశీలించిన శాస్త్రవేత్తలు


వరి పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సుజాతనగర్, అక్టోబరు 8: కోతకు ముందే పక్వానికి వచ్చిన వరి వంగడం ఎంటీయు 1262 రకాన్ని మంగళవా రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. సుజాతనగర్ మండలంలో ఎంటీయు 1262 వరి వంగడం వేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ఎంటీయు 1262 రకం నాటిన 150 నుంచి 160 రోజుల్లో కోతకు రావాల్సి ఉంది. కాని అంతకంటే నెల రోజులు ముందే పక్వానికి రావడంతో రైతులు వ్యవసాయాధికారులకు విన్నవించారు. దీనితో శాస్త్రవేత్తలు ఎంటీయు 1262 రకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణమ్మ మాట్లాడుతూ ఎంటీయు 1262 రకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, త్వరలోనే నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శివ, మండల వ్యవసాయాధికారి జి.నర్మద, ఎంఏఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించాలి: కలెక్టర్ పాటిల్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పాల్వంచ రూరల్, అక్టోబరు 8: అభయారణ్య పర్యాటక కేంద్రంగా పేరొందిన కిన్నెరసాని పర్యాట కేంద్రానికి వచ్చే వారిని ఆకర్షించేవిధంగా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కిన్నెరసాని పర్యటక కేంద్రం, జలాశయాన్ని సందర్శిం చారు. కిన్నెరసాని పర్యాటనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయన ప్రాజెక్టు పార్కు లో చే యాల్సిన అభివృద్ధి పనులు, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు పరిశీలించి అధికా రులకు సూచనలు చేశారు. డ్వాక్రా సంఘాల ద్వారా క్యాంటిన్ ఏర్పాటుచేసి తక్కువ ఖర్చు తో తినుబండారాలు, టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఔషదమొక్కలపై అవగాహన కల్పించి ఆ మొక్కలను నాటాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ట్యాంకులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇందుకు కావాల్సిన ప్రతిపాదనలు వారం రోజు ల్లో పంపించాలని అటవీశాఖాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ జి. వివేక్, ఎంపీడీవో విజయబాస్కర్‌రెడ్డి, ఎంపీవో నారాయణ, ఏవో సురేష్, బీటీ ఆఫీసర్ రాములు తదితరులు ఉన్నారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా వెంకటేశ్వర్లు

భద్రాచలం, అక్టోబరు 8: జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా భద్రాచలానికి చెందిన లకావత్ వెంకటేశ్వర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని మంగళవారం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దిశ ఆత్మ కమిటీ, ప్రజా సేవలో, పార్టీలో కష్టపడి పని చేసిన తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అటవీ క్రీడల్లో సెక్షన్ అధికారి ప్రతిభ


మెడల్స్‌తో మల్లయ్య

జూలూరుపాడు, అక్టోబరు 08: రాష్ట్ర స్థాయిల్లో జరిగిన అటవీ శాఖ క్రీడాల్లో భద్రాద్రి జిల్లా జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని పాపకొల్లు సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.మల్లయ్య పాల్గొని బహుమతులను సాధించారు. ఆయన అథ్లెటిక్స్ పోటిల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. హైదారాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమిలో ఈ నెల 6,7 తేదీలలో 2 రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన పోటిల్లో ఆయన 800 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెలలో పాల్గొని సత్తా చాటారు. అదే విధంగా హైజంప్‌లో మూడో స్థానంలో నిలిచి మెడల్స్‌ను సాధించారు. క్రీడల్లో ప్రతిభను కనబరిచిన ఆయన్ను అటవీ శాఖ ఉన్నత అధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

● ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్

సత్తుపల్లి, అక్టోబరు 8: ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుందని, ప్రమాదాల నివారణ కు చర్యలు తీసుకోబోతున్నామని హన్మకొండ ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం ఆయన సత్తుపల్లి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులలో రవాణాశాఖల సిబ్బంది సంఖ్య పెరుగుతుందని, ఆ తరువాత ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల తనిఖీ, హెల్మెట్ పెట్టుకోవడం, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తదితర అంశాలపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. దసరా సెలవుల దృష్ట్యా స్వగ్రామాలకు వాహనాలపై వెళ్లేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వేగాన్ని నియంత్రిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కల్లూరు చెక్‌పోస్ట్, సత్తుపల్లి ప్రాంతీయ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణాలను త్వరలోనే చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్టీవో వెంకటరమణ, సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్దులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో గుప్త నిధుల కోసం తవ్వకాలు

- విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు
- వ్యక్తిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఘటన ఆలస్యంగా వెలుగులోకి..



కామేపల్లి, అక్టోబరు 8: గుప్త నిధుల కోసం ఓ చిట్టడవిలో కొందరు వ్యక్తులు పూజలు చేస్తూ పట్టు బడిన సంఘటన కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో జరిగింది. ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలలోకి వెళితే కామేపల్లి మండలం మద్దులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో సెప్టెంబరు 28న రాత్రి ఏడు గంటల సమయంలో కొందరు వ్యక్తులు పసుపు కుంకుమతో అడవిలో ఓ గుంట తీసి పసుపు కుంకుమతో పూజలు చేస్తున్నారని సమాచారం అందడంతో తాళ్లగూడెం సెక్షన్ పరిధిలోని మద్దులపల్లి బీట్ ఆఫీసర్ నాగరాజు, వాచర్లు సతీష్, భానుతో కలిసి అక్కడికి వెళ్లేసరికి అక్కడ ఓ వ్యక్తి పూజలు చేస్తూ అరుస్తుండగా వీళ్లను చూసిన ఓ ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. ఓ వ్యక్తిని పట్టుకొని.. అతన్ని, అక్కడ ఉన్న ఓ కారు తీసుకొని కామేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అతన్ని విచారించగా అతని పేరు గుగులోత్ రాజు అని ఇల్లెందు మండలం వేపలగడ్డకు చెందిన వాడినని తెలిపాడు. అతనితో పాటు వచ్చి మరో ఇద్దరు కారేపల్లి మండలం మాణిక్యారానికి చెందిన జగ్గయ్య అని మరో వ్యక్తి మద్దులపల్లి గ్రామానికి చెందిన లింగుస్వామి అని తెలిపాడు. ఈ సంఘటనపై బీట్ ఆఫీసర్ నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాజు, జగ్గయ్య, లింగుస్వామిపై పోలీసులు అదే రోజు రాత్రి బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. గుప్త నిధుల కోసం వారు తవ్వకాలు మొదలుపెట్టడంతో ఇంతలో ఫారెస్ట్ అధికారులు రావడంతో వారి ప్రయత్నం విఫలం అయింది. గుప్త నిధుల తవ్వకాలపై గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

గంజాయి కేసులో 11మంది అరెస్టు

- ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ ఏ.రఘు


స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలను చూపుతున్న ఏసీపీ రఘు

సత్తుపల్లి, అక్టోబరు 8: గజాయి పీల్చడం, విక్రయానికి సంబంధించి సత్తుపల్లి పోలీసులు జరిపిన విచారణలో 82మందిని గుర్తించారు. వీరిలో 11మందిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కల్లూరు ఏసీపీ ఏ.రఘు, సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణం, మండలానికి చెందిన పలువురు గంజాయి పీల్చడంతో పాటు కొందరు విక్రయిస్తున్నారనే సమాచారం అందిందని, ఈ మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన పాశం వెంకట రామకృష్ణ, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ద్వారకాపూరి కాలనీకి చెందిన కొమ్ము మనోవర్ధన్, ఎండీ ఆసుపత్రి రోడ్డులో నివాసం ఉంటున్న ఆరుమళ్ల తరుణ్‌కుమార్, అదేరోడ్డుకు చెందిన వేల్పుల పుల్లారావు, ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరం సమీపంలో ఒక మోటారు సైకిల్ చోరీచేసి, మరో మోటారు సైకిల్‌పై ఆంధ్రా-ఒరిస్సా బోర్డర్‌లోని ఆవులపాకకు 20రోజుల క్రితం వెళ్లి భగవాన్ అనే వ్యక్తి వద్ద నుంచి 3కిలోల గంజాయిని కొనుగోలు చేసి వచ్చారు. వారు దానిని కొంత పీల్చడం, ఖర్చుల నిమిత్తం చిన్న ప్యాకెట్లలో గంజాయిని పెట్టి రూ.500చొప్పున విక్రయించేవారు. వీరివద్ద కిష్టారం గ్రామానికి చెందిన కువ్వారపు దివాకర్ గంజాయి కొనుగోలు చేసి అతని స్నేహితులకు అమ్ముతూ తెలిసిన వారిని వెంకట శివరామకృష్ణ వద్దకు పంపుతూ ఉండేవాడు. ఈ క్రమంలో సత్తుపల్లి మండలం తాళ్లమడకు చెందిన నున్నా నవీన్, సత్తుపల్లి పట్టణానికి చెందిన వెలిశాల వినయ్‌లు శివరామకృష్ణ వద్ద అరకిలో గంజాయిని కొనుగోలు చేశారు. 10రోజుల క్రితం పాశం వెంకట శివరామకృష్ణ, ఏలూరు జిల్లా జనార్ధనవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి రత్నబాబు, కిష్టారం గ్రామానికి చెందిన కొమ్ము మనోవర్ధన్, కిష్టారానికి చెందిన రామాల కార్తీక్, పాలకుర్తి రాజేష్ మొత్తం ఆరుగురు కలిసి అద్దెకు తీసుకున్న కారుతో పాటు మరో మోటారు సైకిల్‌పై ఆవులపాకకు వెళ్లి అక్కడ భగవాన్ వద్ద 4కిలోల గంజాయి కొనుగోలు చేశారు. పోలీసు తనిఖీలు ఎక్కువగా ఉండడంతో గంజాయిని భద్రాచలం సమీపంలో భద్రపరిచి వచ్చారు. ఈనెల 6న గంజాయి తీసుకుని వస్తుండగా సత్తుపల్లి మండలం మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు వీరిని దాడిచేసి పట్టుకున్నారు. వీరివద్ద నుంచి రూ.1,46,125ల విలువైన 5కిలోల 845గ్రాముల గంజాయిని, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా మొత్తం 82మంది గంజాయి కొనుగోలు చేసి పీలుస్తున్నారని సమాచారం అందిందని, పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని ఏసీపీ రఘు తెలిపారు. ఇప్పటివరకు 11మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

గంజాయి క్రయవిక్రయాలు, గంజాయి వాడకం చట్టరీత్యా నేరమని, ఎవరైనా గంజాయి పీల్చినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. గంజాయి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, సమాచారం చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన రివార్డులు అందజేస్తామని ఏసీపీ తెలిపారు. గంజాయి కేసు పురోగతి సాధించడంలో కృషి చేసిన సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్, సహకరించిన వేంసూరు ఎస్ఐ వీరప్రసాద్, పోలీసు సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ప్రత్యేకంగా అభినందించారని ఏసీపీ తెలిపారు.

మా హాజరు.. మా ఇష్టం..

- ఆడిట్ అధికారుల ఛాంబర్‌లోనే హాజరు రిజిస్టర్
- ఇష్టా రీతిగా హాజరు నమోదుపై విమర్శలు


ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఎగ్జామినర్ ఛాంబర్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 8: మేము కమిషనర్ పరిదిలో కాదు.. మా హాజరు.. మా ఇష్టం.. మా హాజరు రికార్డు మా ఛాంబర్‌లోనే ఉండాలి. ఇది ఖమ్మం నగర పాలక సంస్థలోని ఓ అధికారి తీరు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సీ1 సెక్షన్ వద్ద మూడు హాజరు రికార్డులను ఉంచి వాటిలో హాజరు నమోదు చేస్తారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డ్రైవర్లు. దీంతో పాటుగా ఐటీ వింగ్ వద్ద బయోమెట్రిక్ విధానంలో కూడా రెగ్యూలర్, ఔట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులకు, డేటా ఎంట్రీ అపరేటర్లకు హాజరు రికార్డులను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ నుంచి ఇంజనీరింగ్ ఎస్ఈలు, ఈఈలు, ఆర్వో, డీసీపీ, ఏసీపీ, మెనేజరు నుంచి కింది స్థాయిలోని ఉద్యోగుల వరకు ఒకే ప్రాంతంలో హాజరు ఏర్పాటు చేశారు. కానీ ఆడిట్ విభాగానికి సంబందించి మాత్రం అధికారులు తమ చాంబర్లలో హాజరు రికార్డులు పెట్టుకొని ఇష్టానురీతిగా విధులకు హాజరౌతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఆడిట్ అధికారులు సమయపాలన పాటించకపోవటంతో కొన్ని ఆర్థిక ఫైల్స్ సరైన ఆడిట్ జరగకుండానే చెల్లింపులు జరుగుతున్నాయని, పనులు చేసి నెలలు గడుస్తున్న ఆడిట్ పనులు పూర్తి కాక పేమెంట్స్ జరగటం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అభివృద్ధి పనులు చేపట్టేం దుకు ముందుకు రావటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న విజేత

సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

గుండాల, అక్టోబరు8: దివ్యాంగులకు అందించే సహాయ ఉపకరణములను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి విజేత అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం దివ్యాంగుల సహాయ ఉపకరణముల ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా 350 రకాల యంత్రాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 9న అశ్వారావుపేట, 10న భద్రాచలం, 11వ తేదీన పాల్వంచలో ఈ శిబిరములను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్. అక్టోబరు 8: మణుగూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు మంజూరైనట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధులను సద్వినియోగం చేసుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి. నవీన్, శివ,కూచుపూడి బాబు, సామా శ్రీనివాసరెడ్డి, తూపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాల ప్రసాదరావుకు అభినందన

అశ్వారావుపేట, అక్టోబరు8: అశ్వారావుపేట మండలం, రామన్నగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఉయ్యాల ప్రసాదరావును భద్రాచలం ఐటీడీఏ పీవో పి. రాహుల్ అభినందించారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో వేద గణితంపైన నిర్వహించిన వర్క్ షాపులో ప్రసాదరావు ప్రాథమిక స్థాయి గణిత శాస్త్రంపై చెప్పిన విశ్లేషణ పట్ల అభినందనలు వెలువడ్డాయి. ఇటీవలే ఆంధ్రజ్యోతిలో ప్రసాదరావు నూతనంగా ఆవిష్కరించిన గణితంపై అప్పు తెచ్చే విషయంలో వాస్తవికత ఏ విధంగా ఉంటుంది, అనే విషయంపై ప్రత్యేక కథనం వెలువడింది. ఈ సందర్భంగా ప్రసాదరావు ఆలోచన విధానాన్ని అభినందించారు.

'అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి'

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు8: ఇంటి పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైన వారికి తక్షణమే ఇంటి పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుమారు 2000 మందికిపైగా దరఖాస్తులు చేసుకున్నారని, వారికి వెంటనే ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి గంధం మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ బలోపేతమే లక్ష్యం

● రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు రవీందర్

చుంచుపల్లి, అక్టోబరు8: బీజేపీని దేశ వ్యాప్తంగా బలోపేతం చేయడమే లక్ష్యమని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పగిడిపాటి రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని రామాంజనేయకాలనీ పంచాయతీలో గల గాంధీనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆకుల నాగేశ్వరరావుగౌడ్, రాయుడు నాగేశ్వరరావు, మోహన్‌రావుగౌడ్, బాణోత్ గణేష్, రామారావు, శంకర్‌నాయక్, ఉమా, సరోజిని, మాధవి, శంకర్, గురులక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు సహకరించాలి

మణుగూరు, అక్టోబరు8: మండలంలోని పోలింగ్ కేంద్రాల మార్పునకు నాయకులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు నవీన్, శివ, పోశం నర్సింహారావు, భీక్షపతి, లింగంపల్లి రమేష్, పోడియం బాలరాజు, సత్రపల్లి సాంబశివరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రామరావు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: సీపీఎం

జూలూరుపాడు, అక్టోబరు8: ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం వెంగన్నపాలెం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా బొల్లు లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గార్లపాటి వెంకటి, కడియాల సత్యనారాయణ, బొల్లు లక్ష్మయ్య, పృథ్విరాజ్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలి

● ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

మణుగూరు రూరల్, అక్టోబరు8 : మణుగూరు నుంచి బీటీపీఎస్‌కు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణుగూరు సీఎస్పీ నుంచి విజయనగరం గ్రామం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పెద్ద, పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రమాద భరితంగా మారిందన్నారు. తక్షణం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పలువురి ఎన్నిక

దుమ్ముగూడెం, అక్టోబరు 8: టీజీ పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నైట్‌నాగారం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కారంపూడి దశంబాబు ఎంపికయ్యారు.

జూలూరుపాడు: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో కాకర్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బి.సంపత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, గుండెపుడి ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. వెంకటరమణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తమను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కూనవరం సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

● ఏరియా జీఎం శ్యాంసుదర్‌కు టీబీజీకేఎస్ వినతి పత్రం

మణుగూరు, అక్టోబరు8 : మండలంలోని కూనవరం పంచాయతీ రైల్వేగేట్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉన్న సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని టీబీజీకేఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ ప్రసాద్‌లు కోరారు. మంగళవారం నాగెల్లి వెంకట్ ఏరియా ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతి పత్రాన్ని కూడా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికుల సౌకర్యార్థం రోడ్డుకు గ్రావెల్ ఫిల్ చేసి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలను చేపట్టాలని కోరారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

పినపాక, అక్టోబరు8: మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మంగళవారం నాటుసారా విక్రయిస్తూ ఓ మహిళ పట్టుబడ్డారు. ఈ మేరకు మణుగూరు ఎక్సైజ్ శాఖ సీఐ రాజిరెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో ఓ మహిళ పట్టుబడిందని, ఆమె వద్ద 2 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు తెలిపారు. కరకగూడెం మండలం కలవలనాగారం గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు నాటుసారాతో పట్టుబడ్డారని, వారి వద్ద 9 లీటర్ల నాటుసారా, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది ప్రసన్నకుమార్, అష్రఫ్ అలీ, అమల, కృష్ణవేణి పాల్గొన్నారు.

పట్టుదలతో కొలువులు సాధించారు

● డీఎస్సీ ఫలితాల్లో కరకగూడెం మండలంలో ఐదుగురికి ఉద్యోగాలు

కరకగూడెం, అక్టోబరు 8: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కరకగూడెం మండలం నుంచి ఐదుగురు ప్రభుత్వ టీచర్లగా కొలువులు సాధించారు. నేతకానిగుంపు గ్రామానికి చెందిన జిమ్మిడి రాధ, జిమ్మిడి లీల ప్రవీణ, రామటెంకి హనమంతరావు, చొప్పాల పంచాయితీ శ్రీరంగాపురం గ్రామానికి జిమ్మిడి లక్ష్మీనారాయణ, చీరుమళ్ల గ్రామానికి చెందిన సిద్ది వినోద్ ఉద్యోగులు సాధించారు.

పినపాక మండలంలో ఆరుగురికి..

పినపాక: డీఎస్సీ ఫలితాల్లో పినపాక మండలం నుంచి ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువులు సాధించారు. ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన అనుమాటి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి భద్రయ్య గుమ్మడి పవన్, టీ కొత్తగూడెం గ్రామానికి చెందిన దొడ్డా వరప్రసాద్, ఉప్పాక గ్రామానికి చెందిన మట్ట నాగరాజు, జానంపేట గ్రామానికి చెందిన దేపాక శ్రీనివాసరావులు ఉపాధ్యాయ కొలువులు సాధించారు.

'దాగి ఉన్న కళలను వెలికి తీయాలి'

ఇల్లెందు టౌన్, అక్టోబరు8 : కార్మికుల శక్తిలో దాగి ఉన్న కళను వెలికి తీయాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం రీజనల్‌స్థాయి సాంస్కృతికపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, సీజీఎం పర్సనల్ జీవి. మోహన్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమ బలోపేతానికి కృషి చేయాలి

ఇల్లెందు టౌన్, అక్టోబర్ 8: విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పీడీఎస్‌యూ పూర్వ నాయకులు సాధినేని పూర్ణచందర్‌రావు, వేణులు పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లెందులో నిర్వహించిన పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో భూక్యా బాలు, ఆవునూరి మధు, గౌని అయిలయ్య, సీతారామయ్య కొత్త కృష్ణవెంకటేశ్వర్లు, బొమ్మెర ముత్యం తదితరులు పాల్గొన్నారు.

అమ్మరూపం..

ఆనందభరితం



భద్రాచలంలో ధాన్యలక్ష్మీ అలంకరణలో దర్శనమించిన అమ్మవారు



భద్రాచలంలో ధాన్యలక్ష్మి అలంకరణలో..

భద్రాచలం, అక్టోబరు 8: శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు మంగళవారం ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ధాన్యలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అభిషేకం, బాలకాండ పారాయణం, సంక్షిప్త రామాయణ హోమం, లక్ష కుంకుమార్చన, అరణ్యకాండ పారాయణం గావించారు. కాగా నేడు అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అశ్వారావుపేట రూరల్: మండలం వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగాజరుగుతున్నాయి.

మణుగూరు టౌన్: దసరా పండుగను పురస్కరించుకుని ఏరియాలోని మణుగూరు ఓసీ గనిలో ఉన్న కనకదుర్గా దేవి ఆలయంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసచారి, ఏజీఎం సివిల్ డి. వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఇంజనీర్ రమేష్ బాబు, మేనేజర్ రాజేశ్వరరావు, డీవైపీఎం అవినాష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆరవరోజు అమ్మవారు భక్తులకు మహలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జూలూరుపాడులో నవరాత్రులలో భాగంగా సోమవారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించారు.

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాకలో సాకేతపురి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి ఏకోన వింశతి 19వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపం వద్ద పూజ కార్యక్రమాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, రమణ, కిషోర్‌బాబు, కమల్, వీరాంజనేయులు, గోవర్ధన్, శ్రీరామ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొత్తగూడెం సాంస్కృతికం/ పాల్వంచ టౌన్: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గా మండపాల్లో కొనసాగుతున్నాయి. అదేవిధంగా గట్టాయిగూడెం ఆదర్శనగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాతాను 6వ రోజు రూ. 5లక్షల కరెన్సీతో మంగళవారం అలంకరించారు. అన్నదానాలు నిర్వహించారు.



బూర్గంపాడులో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



జూలూరుపాడులో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



పూజలు నిర్వహిస్తున్న జీఎం రామచందర్, అధికారులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్‌వి పాటిల్, అధికారులు



బతుకమ్మలను తీసుకువస్తున్న కలెక్టర్ సతీమణి శ్రద్ధమహాజన్, అధికారులు

బతుకమ్మ సంబురాలు

భద్రాచలం, అక్టోబరు 8: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఐటీడీఏ పీవో రాహుల్ సతీమణి మనీషా మహిళలతో కలిసి బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. వారితో కలిసి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మ విశిష్టతను పీవో సతీమణి మనీషా వివరించారు. మన జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని ప్రకృతి గొప్పతనాన్ని గౌరవించడం కోసమే బతుకమ్మ పండగ ఆంతర్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేయాలి

పాల్వంచ టౌన్: పట్టణ పరిధిలోని ఈ నెల 10వ తేదీన చెరువుల వద్ద జరిగే బతుకమ్మ నిజ్జన ఏర్పాట్లను మునిసిపల్ అధికారులు ముమ్మరం చేశారు. అయా పనులను మునిసిపల్ డీఈ స్వరూపరాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మల నిమజ్జనాని వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాము, వర్క్ ఇన్‌స్పెక్టర్ అంజన్‌రావు, రామజోగి, జాకీర్‌పాషా, రవి పాల్గొన్నారు.

మహిళలకు చీరెల పంపిణీ

జూలూరుపాడు: జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని న్యూకాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్న మహిళలకు మంగళవారం మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో చీరెలను అందజేశారు. రూ.25వేల విలువ చేసే చీరెలను 60మంది మహిళలకు పంపిణీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఇల్లంకి తిరుపతి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుడిపూడి ప్రభాకర్, పోతురాజు రామారావు, నాయకులు ప్రతాప్, ఫణితి వెంకటేశ్వర్లు, ఇల్లంగి సుందర్‌రావు, కల్లోజి శివ, రవికాంత్, కమలాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో ఐటీడీఏ పీవో సతీమణి మనీషా, ఉద్యోగులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ, అక్టోబరు 8: మండల పరిధిలోని బసవతారకకాలనీ గ్రామశివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.14వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

'రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి'



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు
లేళ్ల వెంకటరెడ్డి, వజ్రాల జమలారెడ్డి, ఎరమల శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండ కృషి చేస్తామని ఆ సంఘం నూతన కమిటీ స్పష్టం చేసింది. మంగళవారం కొత్తగూడెం కేసీవో ఎక్లబ్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ఐక్యత కోసం భవిష్యత్ కార్యచరణ ఇతరాత్ర అంశాలపై విస్తృతస్థాయి చర్చలు నిర్వహించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కొత్తగూడెం డివిజన్ నూతన కమిటీని ఎన్నకున్నారు. కొత్తగూడెం డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి, అధ్యక్షుడిగా వజ్రాల జమలా రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎరమల శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా కాసాని శ్రీనివాసరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి, అధికార ప్రతినిధి వై. శ్రీనివాసరెడ్డి, నాయకులు పి. గోపాల్‌రెడ్డి, ఎం. సోమిరెడ్డి, కే. సుధాకర్‌రెడ్డి, ఎల్. పిచ్చిరెడ్డి, రెడ్డం తులసిరెడ్డి, జవహర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు

రూ.30కోట్ల నిధుల మంజూరు

● ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట/దమ్మపేట, అక్టోబరు 8: నియోజకవర్గంలోని మహిళా స్వయం సంఘాలకు రూ.30కోట్ల విలువైన ఉపాధిని కల్పించే పలు రకాలైన యూనిట్లు కోసం రుణాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మంగళవారం దమ్మపేట టీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో చెక్కులను వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీమీట్‌లో ఎస్ఐ ప్రతిభ

జూలూరుపాడు, అక్టోబరు8 : వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన పోలీస్‌డ్యూటీమీట్‌లో జూలూరుపాడు ఎస్ఐ బి. రాణాప్రతాప్ పాల్గొని ప్రతిభను కనబర్చారు. పోలీసుకు సంబంధించిన ప్రోగ్రాం ఏబీటీటీ విభాగంలో జోన్‌లోనే ప్రథమ బహుమతిని సాధించారు. దీంతో మంగళవారం వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ జా ఎస్ఐ రాణాప్రతాప్‌కు గోల్డ్ మెడల్‌ను అందజేసి అభినందించారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

» డిప్యూటీ సీఎం భట్టికి పోలీస్ సంక్షేమ సంఘం వినతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు8: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గత కొంతకాలంగా పోలీస్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది టీఏ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని భద్రాద్రి జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఖమ్మంలో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎంకు భద్రాచలం శ్రీ సీతారామ స్వామి మెమోంటోను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌బీ-1 సీఐ చెన్నూరు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఏసోబు, జాయింట్ సెక్రటరీ జాన్‌మియా, ట్రెజరర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేలో సమస్యలకు పరిష్కారం చూపండి

● న్యాయం చేస్తానని మంత్రి పొంగులేటి హామీ

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు8 : భద్రాద్రి జిల్లాలో 67క్లస్టర్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓలు సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం దిశగా కార్యచరణను రూపొందిస్తానని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారం, పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలకు హాజరైన మంత్రికి టీఎన్‌జీఓస్, ఏఈఓ జేఏసీల నేతృత్వంలో ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రస్తుతం ఏఈఓలు 49రకాల పనులను చేయడంతో పాటు డిజిటల్ క్రాప్ సర్వేతో పనిభారం పెరుగుతుందని, సహాయకులను నియమించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ లోన్ సర్వేలో భద్రాద్రి జిల్లా ఏఈవోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భావించామని... జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్‌ని మంత్రి పొంగులేటి వివరణ కోరగా ఏఈఓలకు పనిభారం అధికంగా ఉంటుందన్నారు. జిల్లాలో క్లస్టర్‌ల వారీగా ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలో పరిష్కారించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ ఏఈవోల సమస్యలపై ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావుతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి చైతన్య భార్గవ్, ఏఈఓల జేఏసీ నాయకులు నర్సింహరావు, అనూష, నవ్య విజయభాను, శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, రవిందర్ రావు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కొత్వాల

పాల్వంచ రూరల్, అక్టోబరు8: జిల్లాలోని సహకార సంఘం రైతుల సమస్యలను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తీసుకెళ్లారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రమార్క్‌ఫెడ్ పాలకవర్గ సమావేశం అనంతరం కొత్వాల మర్యాదపూర్వకంగా మంత్రి తుమ్మలను కలిశారు. ప్రభుత్వం ద్వారా రైతుల కు అందిన రుణాల వివరాలను మంత్రికి తెలిపారు. రుణాలు పొందని వారికి అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రికి వివరించారు.

జెన్‌కో సీఎండీని కలిసిన హెచ్-64 నాయకులు

పాల్వంచ, అక్టోబరు 8: జెన్‌కో సీఎండీని ఏఐటీయూసీ హెచ్-64 కార్మిక సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధాలో జెన్కో సీఎండీ రోనాల్డ్‌రోస్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రావుల మురళి, దుగ్గిరాల సుధాకర్, యేసయ్య, మస్తాన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.